సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం, 9, జూన్, 2023



చెరువులకు జలకళ

మిషన్ కాకతీయ పనులతోనే చెరువులు, కుంటలకు జలకళ సంతరించుకుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి అన్నారు. 10లో▸



సంఘాల పనితీరు భేష్

తెలంగాణ రాష్ట్రంలో మహిళా సంఘాల పనితీరు బాగుందని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర అధికారుల బృందం కితాబిచ్చింది. 10లో▸



పరిష్కరించుకోవాలి..

లోక్ అదాలత్‌ల ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని విశ్రాంత న్యాయమూర్తి సాంబశివరావు అన్నారు. 10లో▸

చెరువు పులకరించెనే..

బతుకమ్మ ఆటపాటలు.. పోతరాజుల నృత్యాలు..డప్పు, ఒగ్గు కళాకారుల డోలు వాయిద్యాలు, బోనాలు, బతుకమ్మలతో తరలివచ్చిన మహిళలతో గురువారం దశాబ్ది ఉత్సవాలు అంబరాన్నంటాయి. మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, అంజయ్యయాదవ్, ప్రజాప్రతినిధులు వేడుకల్లో పాల్గొన్నారు.



మహేశ్వరం: బతుకమ్మతో అమీర్‌పేట్ చెరువుకట్ట వద్దకు వస్తున్న అనితారెడ్డి



మీర్‌పేట: చందన చెరువు ట్యాంక్ బండ్ వద్ద ఉత్సవాల్లో మంత్రి సబితారెడ్డి



కడ్తాల్: చెరువుల పండుగలో భాగంగా కడ్తాల్ చెరువు వద్ద తెలంగాణ తల్లికి పూజలు

న్యూస్‌రీల్

మత్స్యశాఖ సొసైటీలకు లైసెన్సుల అందజేత



లైసెన్సులు అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి తదితరులు

కందుకూరు: నూతనంగా ఏర్పడిన మత్స్యకార సొసైటీలకు మంత్రి సబితారెడ్డి గురువారం లైసెన్సులు అందజేశారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో కందుకూరు, నేదునూరు, పులిమామిడి గ్రామాలకు చెందిన సొసైటీలకు అనుమతి పత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మల్లేశం, జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి, మత్స్యకారుల సొసైటీ సభ్యులు ఉదయ్ ముదిరాజ్, రొట్టెల కృష్ణయ్య, రవీందర్, నరసింహ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగు సంబరం



భైరంపల్లిలో పత్తి విత్తనాలు నాటుతున్న రైతులు

కొందుర్గు: మృగశిర కార్తె ప్రారంభంలోనే వరుణ దేవుడు కరుణించాడు. పంటల సాగుకు అనువైన వర్షం కురవడంతో రైతులు సంబరపడుతున్నారు. రెండు రోజులుగా కురిసిన వర్షంతో విత్తనాలు నాటే పనుల్లో బిజీగా ఉన్నారు.

నేడు తుక్కుగూడలో మంత్రి పర్యటన

మహేశ్వరం: తుక్కుగూడ మున్సిపల్ పరిధిలోని మంఖాల్ 6, 7, 8 వార్డుల్లో రూ.1.36 కోట్ల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శుక్రవారం మంత్రి సబితారెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం గొల్లకుర్మలకు గొర్రెలు పంపిణీ చేస్తారని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రామ్ తెలిపారు. కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

18న మంచినీళ్ల పండుగ

సాక్షి, రంగారెడ్డి జిల్లా: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 18న మంచినీళ్ల పండుగను ఘనంగా నిర్వహించాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం మండలం ముచ్చర్ల, వికారాబాద్ జిల్లా పరిగి మండలం రాఘవపూర్‌లో నిర్వహించే కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారు. ఈ మేరకు గురువారం సచివాలయంలోని తన చాంబర్‌లో మిషన్ భగీరథ అధికారులతో సమీక్షించారు. ఇంటింటికీ నల్లా ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడుతున్నారని చెప్పారు. ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ద్వారా రక్షిత మంచినీరు అందిస్తూ మహిళల నీటి కష్టాలు తీర్చిన అపర భగీరథుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు.

100కు తప్పుడు ఫిర్యాదు

మహిళకు 30 రోజుల జైలుశిక్ష

సైదాబాద్: మద్యం మత్తులో పక్కింటివారితో తగువు పడి డయల్ 100కి ఫోన్ చేసి తప్పుడు ఫిర్యాదు చేయటంతో పాటు విచారణకు వెళ్లిన పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించిన మహిళకు న్యాయస్థానం 30 రోజుల జైలుశిక్ష విధించింది. సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ సుబ్బిరామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సింగరేణి కాలనీలో నివసించే హనుమంతు భార్య మునావత్ జంకు కూలిపనులకు వెళ్తుండేది. బుధవారం రాత్రి మద్యం మత్తులో ఉన్న ఆమె పక్కింటివారితో గొడవ పడింది. 100కి ఫోన్ చేసి తన చైన్ స్నాచింగ్ గురైందని తప్పుడు ఫిర్యాదు చేసింది. సమాచారం అందుకున్న సైదాబాద్ ఎస్‌ఐ మోజీరాం సిబ్బందితో కలిసి సింగరేణి కాలనీకి వెళ్లారు. వారి విచారణలో చైన్ ఆమె వద్దనే ఉంచుకొని తప్పుడు ఫిర్యాదు చేసినట్లు గుర్తించారు. అక్కడ విచారిస్తున్న పోలీసు సిబ్బంది విచారణను అడ్డుకోవటమే కాకుండా వారితో దురుసుగా ప్రవర్తించింది. దీంతో పోలీసులు ఈ–పెట్టీ కేసు నమోదు చేశారు.

కేసీఆర్ కిట్.. నగదు కట్!

కేసీఆర్ కిట్టుకు నిధుల కొరత ఏర్పడింది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పు చేయించుకుని.. పథకంలో భాగంగా ఇచ్చే నగదు కోసం చూస్తున్న వారికి రెండేళ్లుగా నిరాశే మిగులుతోంది. జిల్లావ్యాప్తంగా సుమారు 32,500 మంది లబ్ధిదారులకు రూ.39 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇదిలా ఉండగా అమలులో ఉన్న పథకానికి సరిపడా నిధులు కేటాయించకుండా.. న్యూట్రిషన్ కిట్టు పేరుతో మరో స్కీం తెచ్చేందుకు చేస్తున్న సన్నాహాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సబ్బు, పౌడర్‌తోనే సరిపెడుతున్న వైనం

- పథకం డబ్బులను రెండేళ్లుగా నిలిపేసిన ప్రభుత్వం
- జిల్లాలో 32 వేల మంది దరఖాస్తుదారులు
- తాజాగా న్యూట్రిషన్ కిట్ల పంపిణీకి సన్నాహాలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: తల్లీబిడ్డల సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కేసీఆర్ కిట్టు పథకం సంపూర్ణంగా అమలు కావడం లేదు. నగదు చెల్లింపు ప్రక్రియ రెండేళ్లుగా నిలిచిపోయింది. దీంతో పథకం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. జిల్లాలో రోజుకు సగటున 150 నుంచి 180 ప్రసవాలు జరుగుతుంటాయి. వీటిలో 60 శాతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో, 40 శాతం ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదవుతున్నాయి. మాతాశిశు మరణాల రేటును తగ్గించి, ఆస్పత్రిలో కాన్పుల సంఖ్యను పెంచాలనే ఉద్దేశంతో పేద, మధ్య తరగతి గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం 2017 మార్చి 3న కేసీఆర్ కిట్టు పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రసవం తర్వాత తల్లీబిడ్డల సంరక్షణ కోసం 15 రకాల వస్తువులతో పాటు పాప పుడితే రూ.13,000, బాబు పుడితే రూ.12,000 నగదు ఇవ్వాలని నిర్ణయించింది. ఈమేరకు అప్పటి నుంచి 2022 మార్చి చివరి వరకు జిల్లాలో 95,658 మంది గర్భిణులు పేర్లు నమోదు చేయించుకున్నారు. వీరిలో 32,500 మందికి రూ.39 కోట్లు చెల్లించాల్సి ఉంది.



నిలిచిన నగదు పంపిణీ

ప్రైవేటు ఆస్పత్రుల్లో బిల్లులు చెల్లించే ఆర్థిక స్తోమత లేని వారంతా ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు చేయించుకుంటున్నారు. ప్రసవానికి ముందే వీరంతా తమ పేర్లను కేసీఆర్ కిట్టు పథకం పోర్టల్‌లో నమోదు చేయించుకుంటున్నారు. వీరికి నాలుగు విడతల్లో డబ్బులు (తొలి విడతగా ఐదో నెలలో రూ.3 వేలు, ప్రసవం తర్వాత ఆడబిడ్డ పుడితే రూ.5 వేలు, మగబిడ్డ పుడితే రూ.4 వేల చొప్పున) ఇవ్వాల్సి ఉంది. పాప లేదా బాబుకు మూడున్నర నెలల టీకా వేయించే సమయంలో రూ.2 వేలు, తొమ్మిది నెలల టీకా వేయించే సమయంలో మిగిలిన మొత్తం రూ.3 వేలు అందజేయాల్సి ఉంది. కానీ జిల్లాలో రెండేళ్ల కాలంగా నగదు పంపిణీ నిలిచిపోయింది. ఏఎన్‌ఎంలు, ఆయాలు, వైద్య సిబ్బంది లబ్ధిదారుల పేర్లు నమోదు చేసి, ప్రక్రియ మొత్తం పూర్తి చేసి సిద్ధంగా ఉంచినప్పటికీ ఖాతాల్లో డబ్బులు జమకాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వీరికి సబ్బులు, దువ్వెన, పౌడర్, దోమ తెర, పరుపు, వంటి వస్తువులు మినహా నగదు ఇవ్వడం లేదు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

ఇప్పటికే అమలులో ఉన్న కేసీఆర్ కిట్టు పథకానికి నిధులు కేటాయించకుండా.. కొత్తగా మరో పథకానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా ఈ నెల 14న నిర్వహించే వైద్య దినోత్సవంలో గర్భిణులకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించింది. రక్త హీనతతో బాధపడుతున్న గర్భిణులకు 500 గ్రాముల మదర్ హార్లిక్స్ బాటిళ్లు(2), 200 మిల్లీలీటర్ల ఐరెన్ సిరప్ బాటిల్స్(మూడు), 500 గ్రాములు లయన్ డేట్స్ (2), ప్లాస్టిక్ బాస్కెట్, ప్లాస్టిక్ కప్, 450 మిల్లీ లీటర్ల విజయ నెయ్యి, ఆల్బెండజోల్ టాబ్లెట్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు గురువారం జిల్లా మంత్రి సబితా ఇంద్రారెడ్డి సంబంధిత శాఖ అధికారులతో సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. న్యూట్రిషన్ కిట్ల పంపిణీ ఏర్పాట్లుపై చర్చించారు.

ఐదేళ్లలో కేసీఆర్ కిట్లు, నగదు పంపిణీ ఇలా

ఆర్థిక సంవత్సరం	లబ్ధిదారులు	కేటాయించిన నిధులు	కిట్స్ పంపిణీ
2017-18	30,539	రూ.10.02 కోట్లు	5,912
2018-19	14,419	రూ.10.20 కోట్లు	6,877
2019-20	23,150	రూ.18.43 కోట్లు	5,882
2020-21	15330	రూ.14.50 కోట్లు	7,121
2021-22	10,719	రూ.11.58 కోట్లు	7,381

చేపలు పుష్కలం

- దిగుమతి నుంచి ఎగుమతి చేసుకునే స్థాయికి చేరాం
- మిషన్ కాకతీయతోనే చెరువులకు జలకళ
- సీఎం కేసీఆర్ కష్టానికి ప్రతిఫలం
- ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌లో మంత్రి సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిండా నీళ్లు, పుష్కలంగా చేపలతో కళకళలాడుతున్నాయని మంత్రి సబితారెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. గతంలో చేపల కోసం ఆంధ్రప్రదేశ్‌పై ఆధారపడేవారమని తెలిపారు. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా సీఎం కేసీఆర్.. చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో పూడిక తీయించి, అభివృద్ధి చేయించారన్నారు. ఇందుకోసం రూ.10 వేల కోట్లు వెచ్చించి, రాష్ట్రంలోని 27 వేల జలాశయాలను అద్భుతంగా తీర్చిదిద్దారని వివరించారు. వర్షాలు సమృద్ధిగా కురవడంతో చెరువులన్నీ నిండుకుండల్లా మారాయని స్పష్టంచేశారు. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన చేపపిల్లలను వీటిలో వేయడం ద్వారా మత్స్య సంపద గణనీయంగా పెరిగిందని వివరించారు. దీంతో చేపలు దిగుమతి చేసుకునే పరిస్థితి నుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకున్నామని సంతోషం వ్యక్తంచేశారు.

ఉమ్మడి రాష్ట్రంలో నీళ్ల గోస

ఉమ్మడి రాష్ట్రంలో వేసవి కాలం వచ్చిందంటే పశువుల కోసం నీటితొట్లు నిర్మించేవారమని, ఇందులో నీటిని నింపి ఆయా గ్రామాల్లోని మూగజీవాల దాహార్తి తీర్చామని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత చెరువులు, కుంటలు నిండా నీళ్లతో తొణికిసలాడుతున్నాయని, భూగర్భ జలాలు సైతం భారీగా పెరిగాయని సంతోషం వ్యక్తం చేశారు. గంగపుత్రులు, మత్స్యకారులు, ముదిరాజ్‌ల కోసం జిల్లాలోని 765 చెరువుల్లో చేప పిల్లలు, రొయ్యల పెంపకం చేపట్టినట్లు మంత్రి వివరించారు. గతంలో ఉన్న సొసైటీలకు అదనంగా కొత్త సొసైటీలు ఏర్పాటు చేసి సభ్యులకు ఆర్థిక చేయూత దక్కేలా చూస్తున్నామన్నారు. మత్స్యశాఖ ద్వారా రూ.138 కోట్ల ఆదాయం వస్తోందని, ఒక్క ఇబ్రహీంపట్నం చెరువులోని చేపలకే రూ.4 కోట్ల ఆదాయం సమకూరడం గొప్ప విషయమని తెలిపారు. మత్స్యకారులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తూ 75 శాతం సబ్సిడీపై రూ.900 కోట్లతో వాహనాలు సమకూర్చి వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను సందర్శించి వంటకాలను ఆస్వాదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఎగ్గే మల్లేశం, బొగ్గారపు దయానంద్ గుప్తా, జిల్లా మత్స్యశాఖ అధికారి సుకృతి, ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, మత్స్యకారుల సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



సరూర్‌నగర్ స్టేడియంలో చేప వంటకాలను పరిశీలిస్తున్న మంత్రి సబితారెడ్డి

అట్టహాసంగా టేబుల్ టెన్నిస్ పోటీలు



ప్రతిభ చాటిన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

మొయినాబాద్: దేశంలో మొదటిసారిగా నిర్వహిస్తున్న టేబుల్ టెన్నిస్ నేషనల్ ర్యాంకింగ్ ఈవెంట్ అట్టహాసంగా కొనసాగుతోంది. నగర శివారులోని మొయినాబాద్ సమీపంలో ఉన్న ఫైర్ ఫ్యాక్స్ స్పోర్ట్స్ అండ్ రిసార్ట్స్‌లో జాతీయ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా పోటీలు కొనసాగుతున్నాయి.28 రాష్ట్రాలకు చెందిన 1,850 మంది క్రీడాకారులు తలపడుతున్నారు. క్రీడాకారుల ప్రతిభ ఆధారంగా జాతీయ ర్యాంకులు నిర్ధారిస్తామని టేబుల్ టెన్నిస్ సమాఖ్య జాతీయ కార్యదర్శి కమలేశ్ మెహతా తెలిపారు. ఈ పోటీలకు అపూర్వ స్పందన వచ్చిందని చెప్పారు. ఇలాంటి పోటీలను జాతీయ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించేందుకు ఫైర్ ఫ్యాక్స్ సిద్ధంగా ఉందని నిర్వాహకుడు విజయ్‌కుమార్ తెలిపారు. పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.

అందని ‘బంధు’

- కొత్త వారికి రైతుబంధు దూరం
- జిల్లా వ్యాప్తంగా 4,860 మంది ఎదురుచూపు
- గత రెండు సీజన్లుగా ఇదే పరిస్థితి
- ప్రస్తుత వానాకాలంలోనైనా ఇవ్వాలని వేడుకోలు

షాబాద్: జిల్లాలో గతేడాది జూలై నుంచి ఇప్పటి వరకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన వారంతా రైతుబంధు కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న దాదాపు మూడు వేల మంది వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడమే జాప్యానికి కారణంగా తెలుస్తోంది. ప్రభుత్వం ఈ యాసంగి, వానాకాలం సీజన్‌లో పెట్టుబడి సాయం అందించే క్రమంలో రైతుబంధు పథకానికి 2022 డిసెంబర్ 20 వరకు కొత్తగా పాస్ పుస్తకాలు లభించిన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది.జిల్లాలో వ్యవసాయ అధికారులు కూడా స్థానికంగా ప్రకటించారు. జనవరి 7వరకు గడువు విధించారు. ఈ క్రమంలో జిల్లాలోని 27 మండలాల్లో 4,860 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా ప్రస్తుతం రైతుబంధు కోసం ఎదురుచూస్తున్నారు.

పోర్టల్ ఓపెన్ అయితేనే..

కొత్త పాస్‌పుస్తకాలు కలిగిన లేదా రిజిస్ట్రేషన్లు అయిన రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వం సాయం అందించాలి. ఇందులో భాగంగా భూమి కొనుగోలు చేసిన వారసత్వం కింద రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. మరోవైపు ధరణి సమస్యలతో నిషేధిత జాబితాలో కొనసాగిన భూముల సమస్యలకు ఇటీవల పరిష్కారం లభించింది. అలాంటి వారికి పాస్ పుస్తకాలు వచ్చాయి. వారంతా మండల స్థాయిలో రైతుబంధుకు దరఖాస్తు చేసుకున్నారు. వారి వివరాలను ఏవో, ఏఈవోలు రైతుబంధు పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంది. అయితే అప్పటి నుంచి ఇప్పటివరకు ఆ పోర్టల్‌లో అధికారులకు ప్రభుత్వం లాగిన్ అవకాశం ఇవ్వలేదు. దీంతో దరఖాస్తుదారుల వివరాలను వారు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. ఫలితంగా ఆయా రైతులకు యాసంగి పెట్టుబడి సాయం అందలేదని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జూన్‌లో లాగిన్ ఇచ్చే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

పథకం అందడం లేదు



నాగర్‌గూడ శివారులో ఇటీవల 20 గుంటల భూమి ఇటీవల నా పేరున పట్టా అయింది. పాస్‌బుక్ సైతం వచ్చింది. కానీ రైతుబంధు పథకం అందడం లేదు. అధికారులను అడిగితే ఆన్‌లైన్ కావాల్సి ఉందని చెబుతున్నారు.

– రావుల లక్ష్మి, మహిళా రైతు, నాగర్‌గూడ

ఈసారి జమవుతాయి



కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన రైతుల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం దీనిని త్వరలోనే ఓపెన్ చేసే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే కొత్త రైతులకు రైతుబంధు డబ్బులు జమవుతాయి.

– గీతారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

మృగశిరం.. మత్స్యం పిరం

ఇబ్రహీంపట్నం: మృగశిర కార్తె సందర్భంగా గురువారం చేపలకు మంచి డిమాండ్ లభించింది. సాధారణ రోజుల్లో రూ.120 కిలో పలికే.. ధర రూ.200 పైగా ఎగబాకింది. అయినా కొనుగోలుదారులు ఏమాత్రం తగ్గలేదు. కార్తె ప్రారంభం రోజున చేప వంటకాలు తినడం ఆరోగ్యానికి మంచిదని మాంసాహార ప్రియులు భావిస్తారు. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నంలో ప్రత్యేక దుకాణాలు వెలిశాయి. చేపల కొనుగోలుకు జనం క్యూకట్టారు.



ఇబ్రహీంపట్నంలో చేపల విక్రయం

నేడే చేప ప్రసాదం

- ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 32 కౌంటర్ల ఏర్పాటు
- నేటి ఉదయం 8 గంటల నుంచి పంపిణీ
- అందుబాటులో 6 లక్షల చేప పిల్లలు

అబిడ్స్/గన్‌ఫౌండ్రీ: ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో బత్తిని కుటుంబ సభ్యులు శుక్రవారం ప్రారంభించే చేప ప్రసాద పంపిణీకి సర్వం సిద్ధమైంది. ఇందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మూడేళ్ల విరామానంతరం ప్రారంభం కానున్న చేప ప్రసాదానికి ఒక రోజు ముందుగానే తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలో వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది గురువారమే తరలిరావడంతో ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ కిక్కిరిసింది.

వెయ్యి మంది పోలీసులతో బందోబస్తు

ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాదం పంపిణీ నేటి ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. ఇందుకోసం 32 కౌంటర్లను ఏర్పాటు చేశారు. బత్తిని కుటుంబాలకు చెం దిన దాదాపు 250 మం దితో పాటు పలు స్వచ్ఛంద సంస్థల వారు కౌంటర్ల ద్వారా చేప ప్రసాదాన్ని అందజేస్తారు. తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ 6 లక్షల చేప పిల్లలను అందుబాటులో ఉంచింది. దాదాపు వెయ్యి మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం నుంచే నగర పోలీసులతో పాటు అదనపు బలగాలు రంగంలోకి దిగాయి. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ అజంతా గేట్, మాలకుంట, గాంధీ భవన్ గేట్ల వద్ద మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరినీ తనిఖీలు చేసిన అనంతరం లోపలికి అనుమతిస్తున్నారు. జాయింట్ కమిషనర్ విశ్వప్రసాద్, డీసీపీ వెంకటేశ్వర్లు, అబిడ్స్ డివిజన్ ఏసీపీ పూర్ణచందర్, బేగంబజార్ ఇన్‌స్పెక్టర్లు శంకర్‌లు బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. ప్రధాన ప్రవేశాల ద్వారా పరిశీలన విభాగం, సీసీ కెమెరాల పనితీరు, ప్రధాన కౌంటర్లను పరిశీలించారు.



బారికేడ్లలో ప్రజలు

కంట్రోల్ రూం ఏర్పాటు..

ప్రజల సౌకర్యార్థం పోలీసులు ఒక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. వేలాది మంది జనం రావడంతో వారికి ఇబ్బంది కలగకుండా కంట్రోల్ రూంలు పోలీస్ శాఖ అంత సమాచారాన్ని ఇవ్వనున్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు అశ్విన్ మార్గం ఆధ్వర్యంలో చేప ప్రసాదానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు, పలు స్వచ్ఛంద సంస్థలు సహకారాన్ని అందిస్తున్నాయి.

ట్రాఫిక్ మళ్లింపు..

పాత బస్తీ నుంచి ఎంజే మార్కెట్ మీదుగా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు వచ్చే వాహనాలను ఇతర ప్రాంతాల మీదుగా శుక్రవారం దారి మళ్లించినట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

మంచాల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మంచాల ఎస్‌ఐ రామన్ గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని సత్యం తండా సమీపంలో ఆగి ఉన్న లారీకి వెనుక నుంచి బైకు ఢీకొట్టిన ప్రమాదంలో సత్యం తండాకు చెందిన రమావత్ సచిన్ (19)అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. సచిన్ తోపాటు ఎల్లపల్లి తండాకు చెందిన సాయిచరణ్(17), సాయి బండ తండాకు చెందిన సిద్దు అనే మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో సాయి చరణ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సిద్దు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.



షాబాద్‌లో పోతరాజుల విన్యాసాలు



షాబాద్‌లో బోనాల ర్యాలీ

సాగునీటికి పెద్దపీట

- ఇరిగేషన్ స్పెషల్ సెక్రటరీ రజిత్‌కుమార్ షైనీ
- పహిల్వాన్ చెరువు కట్టపై అవతరణ సంబరాలు
- హాజరైన జెడ్పీచైర్‌పర్సన్, ఎంపీ, ఎమ్మెల్యే

షాబాద్: తెలంగాణ ప్రభుత్వ హయాంలో సాగునీటి రంగానికి పెద్ద పీట వేశారని ఇరిగేషన్ స్పెషల్ సెక్రటరీ రజిత్‌కుమార్ షైనీ పేర్కొన్నారు. గురువారం రాత్రి షాబాద్ పహిల్వాన్ చెరువు కట్టపై తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ, బోనాలు, పోతురాజుల విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. మహిళలతో కలిసి బతుకమ్మ, కోలాటం ఆడారు. జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, చీఫ్ ఇంజనీర్ వర్మ, కలెక్టర్ హరీష్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి తదితరులు ఉత్సవాల్లో పాల్గొని సందడి చేశారు. చెరువు కట్ట దగ్గర కలెక్టర్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రజిత్‌కుమార్ షైనీ మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో మిషన్ కాకతీయ పథకంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం చెరువులలో పూడికతీత, కరకట్టల నిర్మాణ పనులు చేపట్టిందన్నారు. గ్రామాల్లోని చెరువులు నీటితో నిండడం ద్వారా భూగర్భ జలాలు పెరిగాయని తెలిపారు.

విజయవంతంగా వేడుకలు..

కలెక్టర్ హరీష్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా దశాబ్ది ఉత్సవాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు. జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటు తర్వాత నీటి నిల్వ పెరిగిందన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయికి చేరుతున్నాయని తెలిపారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, గ్రామ సర్పంచ్ తమ్మలి సుబ్రహ్మణ్యేశ్వరి, చేవెళ్ల ఆర్డీవో వేణుమాధవ్‌రావు, తహసీల్దార్ సైదులుగౌడ్, ఎంపీడీఓ అనురాధ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మహిళా సంఘాల మహిళలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేసులను సత్వరమే పరిష్కరించుకోవాలి

విశ్రాంత న్యాయమూర్తి సాంబశివరావు

చేవెళ్ల: లోక్ అదాలత్‌ల ద్వారా ట్రాఫిక్ కేసులను సత్వరమే పరిష్కరించుకోవాలని విశ్రాంత న్యాయమూర్తి సాంబశివరావు అన్నారు. చేవెళ్లలో గురువారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ కేసులను ఎక్కువ రోజులు పెండింగ్‌లో పెట్టవద్దని చెప్పారు. లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకుని కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ నెల 10వ తేదీ వరకు నిర్వహించే లోక్‌అదాలత్‌లో ట్రాఫిక్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను పరిష్కరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని 65 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎన్. వాసు, ఎస్సైలు విఠల్‌రెడ్డి, బాల్‌రాజ్, ఏఎస్సై చందర్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్లలో లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న విశ్రాంత న్యాయమూర్తి సాంబశివరావు

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

శంకర్‌పల్లి: మండల పరిధిలోని బుల్కాపూర్ గ్రామ సమీపంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుల్కాపూర్ రాఘవేంద్రస్వామి దేవాలయం వద్ద స్థానికులు గుర్తుతెలియని వ్యక్తి(50) మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండటంతో వారం రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చని.. భిక్షాటన చేసే వ్యక్తి అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మహిళా సంఘాల పనితీరు భేష్

ఉత్తరప్రదేశ్ రాష్ట్ర అధికారుల బృందం కితాబు

మొయినాబాద్/మొయినాబాద్ రూరల్: తెలంగాణ రాష్ట్రంలో మహిళా సంఘాల పనితీరు బాగుందని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర అధికారుల బృందం కితాబిచ్చింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, బ్యాంకు అధికారుల బృందానికి చెందిన 25 మంది రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థలో స్వయం సహాయక సంఘాల ఆర్థిక బలోపేతం, సంఘాల పనితీరు వంటి అంశాలపై ఐదు రోజుల పాటు శిక్షణ పొందడానికి వచ్చారు. ఇందులో భాగంగా గురువారం మొయినాబాద్, కనకమామిడిలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని ఎలాంటి వ్యాపారాలు చేస్తున్నారని.. ఉపాధి ద్వారా ఆదాయం ఎలా పొందుతున్నారని మహిళలను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలతో కిరాణ షాపులు, ఫ్యాన్సీ షాపులు, మొబైల్ టిఫిన్ సెంటర్‌లు, ఇస్తరాకుల తయారీ, టైలరింగ్ షాపులు పెట్టుకున్నామని.. కొంత మంది వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమను ఏర్పాటు చేసుకుని ఆదాయం పొందుతున్నామని మహిళలు వివరించారు. అలాగే.. పలు రకాల సామాజిక కార్యక్రమాల్లో కూడా భాగస్వాములం అవుతున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని, ఈ విధానాన్ని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ డీపీఎం స్వర్ణలత, ఏఈఎం రవీందర్, సీసీ జంగయ్య, మహిళా సంఘాల అధ్యక్షులు మనీలా, భార్గవి, అశ్విని, వాణి, రేణుక, నస్రీన్ పాల్గొన్నారు.



కనకమామిడిలో ఉత్తరప్రదేశ్ అధికారుల బృందానికి వివరిస్తున్న సర్పంచ్ జనార్దన్‌రెడ్డి

మిషన్ కాకతీయతో చెరువులకు జలకళ



చింతపట్ల లక్ష్మణ్ చెరువు వద్ద మహిళలతో కలిసి ఎమ్మెల్యే మంచిరెడ్డి..

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- మత్స్యసంపదతో ముదిరాజులకు ఉపాధి
- చింతపట్లలో ఘనంగా చెరువు పండుగ

యాచారం: మిషన్ కాకతీయ పనులతోనే చెరువులు, కుంటలకు జలకళ సంతరించుకుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండల పరిధిలోని చింతపట్ల లక్ష్మణ్ చెరువు వద్ద చెరువుల పండుగ నిర్వహించారు. కట్టపై ఉన్న మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలతో నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంచిరెడ్డి మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం డివిజన్‌లో నాలుగు విడతల్లో రూ.421 కోట్ల నిధులతో చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు చేయించినట్లు తెలిపారు. చెరువులు, కుంటల్లో నీరు పుష్కలంగా ఉండటంతో మత్స్య సంపద పెరిగిందన్నారు. దీంతో ముదిరాజులు లక్షలాది రూపాయల ఆదాయం పొందుతున్నారని పేర్కొన్నారు. చింతపట్ల లక్ష్మణ్ చెరువు కట్ట విస్తరణకు రూ.10 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలోని బొడ్రాయిని సందర్శించి పూజలు నిర్వహించారు. అలాగే.. సీఎంకప్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన చింతపట్ల గ్రామానికి చెందిన వాలీబాల్ క్రీడాకారిణి శివానిని ఘనంగా సత్కరించి రూ.1,500 నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొప్పు సుకన్య, జెడ్పీటీసీ చిన్నోళ్ల జంగమ్మ, సర్పంచ్ లిక్కి సరిత, ఎంపీటీసీ సభ్యురాలు తాండ్ర లక్ష్మమ్మ, ఎంపీడీఓ, తహసీల్దార్ పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న స్కూటీ.. ఒకరు మృతి

కేశంపేట: బైక్‌ను స్కూటీ ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన కేశంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని లేమామిడి గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం జేపి తండాకు చెందిన పాత్లావత్ యుగేందర్ (21)కు ఇటీవల షాద్‌నగర్ పోస్టాఫీసులో ఉద్యోగం వచ్చింది. పని నిమిత్తం తలకొండపల్లి మండలం పాతకోటతండాకు చెందిన నవీన్‌తో కలసి స్కూటీపై షాద్‌నగర్‌కు బయలుదేరాడు. నవీన్ స్కూటీ నడుతుండగా..యుగేందర్ వెనకాల కూర్చున్నాడు. మండల పరిధిలోని లేమామిడి గ్రామ శివారులోని గాంధీశంకర్‌పల్లి వద్ద చేరుకోగానే.. ముందు వెళ్తున్న బైక్‌ను స్కూటీ ఢీకొట్టింది. ఈ ఘటనలో రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో యుగేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ధనుంజయ్ తెలిపారు.



యుగేందర్

కారు ఢీకొని విశ్రాంత ఉద్యోగి మృతి



రామచంద్రారెడ్డి (ఫైల్)

శంకర్‌పల్లి: కారు ఢీకొనడంతో ఓ విశ్రాంత ఉద్యోగి మృతి చెందాడు. ఈ సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా ఎద్దు మైలారం గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి(67) హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సివరేజ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసి 2015లో రిటైర్డ్ అయ్యారు. అనంతరం భార్య పిల్లలతో కలిసి శంకర్‌పల్లిలో నివాసం ఉంటున్నారు. గురువారం ఉదయం లూనా వాహనంపై ఎత్తుమైలారంలోని పొలం వద్దకు వెళ్లి, తిరిగి శంకర్‌పల్లికి వస్తుండగా షుగర్ ఫ్యాక్టరీ మలుపు వద్ద అతివేగంతో వచ్చిన కారు లూనాను ఢీకొట్టింది. దీంతో రామచంద్రారెడ్డి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కారు బోల్తా.. మహిళ మృతి



బోల్తా పడిన కారు



ముత్యాలి మృతదేహం

మరో ఐదుగురికి గాయాలు

ఆమనగల్లు: మండల పరిధిలోని చింతపల్లి సమీపంలో గురువారం సాయంత్రం కారు బోల్తా పడింది. ఈ ఘటనలో మహిళ మృతి చెందగా మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. మేడిగడ్డ తండాకు చెందిన ఎంపీపీ అనిత కుటుంబ సభ్యుల వివాహ నిశ్చితార్థం చింతలపల్లి సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో జరిగింది. అనంతరం కారులో వస్తుండగా చింతలపల్లి గ్రామ సమీపంలో అదుపుతప్పి కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముత్యాలి (53) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అపూర్వ, అనిత, అర్చన, సహారా తన్మై, రవి లను నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ సమీపంలోని ఎన్నం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి క్షతగాత్రులను ఆస్పత్రిలో పరామర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుందరయ్య తెలిపారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి



అనిల్‌కుమార్ యాదవ్

కందుకూరు: విద్యుదాఘాతంతో ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కృష్ణంరాజు కథనం ప్రకారం.. మండల పరిధిలోని రాచులూరుకు చెందిన అనిల్‌కుమార్‌యాదవ్(35) గతంలో విద్యుత్ శాఖలో పనిచేసి మానేశాడు. ప్రస్తుతం గ్రామంలో పాల బూత్ నిర్వహణతో పాటు ఖాళీ సమయాల్లో విద్యుత్ అధికారుల పర్యవేక్షణలో కరెంట్ మరమ్మతు పనులు చేయడానికి వెళ్తుంటాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం బైరాగిగూడ సమీపంలో విద్యుత్ లైన్‌కు మరమ్మతులు చేస్తున్నాడు. స్తంభంపైకి ఎక్కి మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ సరఫరా అయింది. దీంతో విద్యుదాఘాతానికి గురైన యాదవ్.. స్తంభంపై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

రాష్ట్రంలో శాంతి భద్రతలు భేష్

- సీసీ కెమెరాలతో నేరాలు తగ్గుముఖం
- హోం మంత్రి మహమూద్ అలీ

సాక్షి, సిటీబ్యూరో: శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా ఉందని రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మేడిపల్లిలోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో పోలీసు సామాజిక సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హోం మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో నూతనంగా ఎన్నో పోలీస్ స్టేషన్లు, ఏసీపీ, డీసీపీ జోన్లు, కమిషనరేట్లు ఏర్పాటు చేసి పోలీస్ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేశామన్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణా ఏర్పాటు అనంతరం పోలీసు శాఖలో చేపట్టిన మార్పులు, సంస్కరణలతో శాంతి భద్రతలు మెరుగుపడ్డాయన్నారు. పోలీసు శాఖలో అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని, అధునాతన పెట్రోలింగ్ వాహనాలతో పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టం చేశామన్నారు. మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాలు ఎన్నో దశాబ్దాలుగా సాధించలేని అభివృద్ధి తెలంగాణ దశాబ్ద కాలంలోనే సాధించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ విధానాలు, మౌలిక వసతుల కల్పనతో మెరుగైన పాలన అందిస్తుందన్నారు.రాష్ట్రాన్ని శాంతి భద్రతల పరంగా ఉన్నత స్థాయిలో ఉంచడానికి పోలీసులు శక్తి వంచన లేకుండా పని చేస్తున్నారన్నారు. తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు తర్వాత కొత్తగా 70 పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు ఒక మైలు రాయి: సీఎస్ శాంతా కుమారి

దశాబ్ది వేడుకలు జరుపుకోవడం రాష్ట్ర చరిత్రలో ఒక మైలురాయి అని చీఫ్ సెక్రెటరీ శ్రీమతి శాంతా కుమారి అన్నారు. అమరుల త్యాగాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిందని రాష్ట్రంలోని ప్రజలందరి సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. 2014 కు ముందు అభివృద్ధిలో అన్ని రకాలుగా వెనుకబడ్డ తెలంగాణ నేడు బహుముఖ రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. డీజీపీ అంజనీ కుమార్ మాట్లాడుతూ.. నేర నియంత్రణలో హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లతో రాచకొండ పోటీపడుతోందని అభినందించారు. మరింత సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని, గ్రామీణ ప్రాంతాల్లో శాంతి భద్రతలపై దృష్టి పెట్టాలని సూచించారు.

బాలికపై లైంగికదాడి

జవహర్‌నగర్: బాలికపై ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. దమ్మాయిగూడకు చెందిన అనిల్ ట్రావెల్స్ నిర్వహిస్తున్నారు. బోడుప్పల్‌కు చెందిన మహిళతో అతనికి పరిచయం ఉండటంతో తరచూ ఆమెతో మాట్లాడుతుండేవాడు. ఈ నేపథ్యంలో సదరు మహిళ కుమార్తెపై కన్నేసిన అనిల్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో దాడికి పాల్పడ్డాడు.